TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 75 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ సోమవారం | జూన్ 29, 2026




## జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదు

- ఓపిక, నిలకడ, నిబద్ధతతోనే విజయాలు సాధ్యం
- బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్
- వీబీఐటీలో 'వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్'
- వర్చువల్‌గా 9 జిల్లాల బీజేపీ కార్యాలయాలు ప్రారంభం
- తెలంగాణలో కమలం వికసించడం ఖాయం
- బీజేపీ జాతీయ నేత ధీమా

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "జీవితం అనేది వంద మీటర్ల పరుగుపందెం కాదు.. అది మన ఓపికకు పరీక్ష" అని బీజేపీ జాతీయ నేత, తెలంగాణ పార్టీ ఇన్‌ఛార్జ్ నితిన్ నబీన్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని వీబీఐటీ క్యాంపస్‌లో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో ఎదుర్కొన్న సవాళ్లపై ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. "నేను చాలా చిన్న వయసులోనే ఊహించని విధంగా రాజకీయాల్లోకి వచ్చాను. ప్రారంభంలో భవిష్యత్తుపై కొంత గందరగోళం ఉన్నప్పటికీ, ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం" అని చెప్పారు. నేటి యువత వేగంగా లక్ష్యాలను అందుకోవాలనే ఆరాటంలో ఉందని, అయితే ఏ పనినైనా ఓపిక, నిలకడ, పూర్తి శక్తితో చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని యువతకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై నుండి వర్చువల్ విధానం ద్వారా రాష్ట్రంలోని మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ (హనుమకొండ) నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణలో బీజేపీ అధికారానికి ఎంతో దూరం లేదని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి విజయం సాధించామని, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని బలోపేతం చేసిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. "ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాలి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుంది." అని నితిన్ నబీన్ అన్నారు. వికసిత తెలంగాణ నిర్మాణం కోసం ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని జోస్యం చెప్పారు. కాగా, సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

## ముఖం చాటేసిన నైరుతి

- దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు
- 146 ఏళ్ల వాతావరణ చరిత్రలో అత్యంత పొడిగా జూన్ నెల
- దేశంలో 40 శాతం తక్కువ వర్షపాతం..
- గుజరాత్‌లో అత్యధికంగా 86 శాతం లోటు
- ఏరువాక సాగక రైతన్న ఆందోళన..
- ఎల్ నినో ప్రభావమే కారణం



2లో..

## తిరుమలలో వైభవంగా ముగిసిన జ్యేష్ఠాభిషేకం


- బంగారు కవచంలో భక్తులకు దర్శనమిచ్చిన మలయప్పస్వామి
- వేడుకగా మహాశాంతి హోమం, స్నపన తిరుమంజనం
- తిరుచానూరులో కనులపండువగా పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు



2లో..

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

- వేడుకల్లో పాల్గొన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ
- ఆకట్టుకున్న భారత ఆర్మీ, నౌకాదళాల కవాతు



2లో..

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు

- రేవంత్ గెలిచింది వాటితోనే!
- ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలి
- కర్ణాటక నుంచి 'నోటు'తో పాటు 'ఓటు' కూడా బదిలీ అయిందా?
- కల్వకుంట్ల కవిత ధ్వజం



2లో..

# ముఖం చాటేసిన నైరుతి

- దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు
- 146 ఏళ్ల వాతావరణ చరిత్రలో అత్యంత పొడిగా జూన్ నెల
- దేశంలో 40 శాతం తక్కువ వర్షపాతం..
- గుజరాత్‌లో అత్యధికంగా 86 శాతం లోటు
- ఏరువాక సాగక రైతన్న ఆందోళన
- ఎల్ నినో ప్రభావమే కారణం

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4నే కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలా ప్రాంతాలు ఇంకా వర్షాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నాయి. గత 146 ఏళ్ల వాతావరణ చరిత్రలోనే ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య దేశవ్యాప్తంగా సాధారణంగా 141.4 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, ఈసారి కేవలం 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. ప్రస్తుతం కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల తీవ్ర అస్థిరతను స్పష్టం చేస్తోంది.రుతుపవనాల స్తంభన కారణంగా దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లో వర్షపాత లోటు భయానకంగా మారింది. గుజరాత్ 86%, మహారాష్ట్ర 60%, ఉత్తరప్రదేశ్ 59%, ఒడిశా 53%, బీహార్ 52%, కర్ణాటక 47%, మధ్యప్రదేశ్ 42%, తెలంగాణ 32% లోటు ఉంది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, ఆ తర్వాత పూర్తిగా స్తంభించిపోయాయి. ఎల్ నినో ప్రభావం వల్ల వానకాలం ప్రారంభమైనా చినుకుజాడ కరువైంది. దీంతో ఏరువాక (సాగు పనులు) సాగక దేశవ్యాప్తంగా వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంత సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. సుదీర్ఘ పొడికాలంతర్వాత వాతావరణంలో తేమ శాతం ఒక్కసారిగా పెరగడం వల్ల, భవిష్యత్తులో అకస్మాత్తుగా కురిసే అతి భారీ వర్షాలు, క్లౌడ్ బరస్ట్‌లు, తీవ్రమైన వరదలు వంటి ముప్పులు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిలావుండగా, తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు 'రెయిన్ అలర్ట్' జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించింది.

# తిరుమలలో వైభవంగా ముగిసిన జ్యేష్ఠాభిషేకం

- బంగారు కవచంలో భక్తులకు దర్శనమిచ్చిన మలయప్పస్వామి
- వేడుకగా మహాశాంతి హోమం, స్నపన తిరుమంజనం
- తిరుచానూరులో కనులపండువగా పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు



**తిరుమల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వార్షిక జ్యేష్ఠాభిషేకం ఆదివారం ఘనంగా ముగిసింది. వేడుకల చివరి రోజైన ఆదివారం నాడు ఉభయ దేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారు తిరిగి బంగారు కవచాన్ని ధరించి భక్తులకు పునః దర్శనమిచ్చారు. మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్ఠాభిషేకం జరిగే వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఇదే బంగారు కవచంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ముగింపు వేడుకల సందర్భంగా ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. అక్కడ ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా 'మహాశాంతి హోమం' నిర్వహించారు. అనంతరం శ్రీమలయప్ప స్వామివారికి, అమ్మవార్లకు విశేషంగా 'స్నపన తిరుమంజనం' (పవిత్ర స్నానాది ఘట్టాలు) చేపట్టారు. ఆ తర్వాత స్వామివారి స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచాల అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహించి భక్తులను కటాక్షించారు. ఈ వైభవ వేడుకల్లో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు సదాశివరావు, జానకి దేవి, సుచిత్ర ఎల్లా, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు కూడా కనులపండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారు పద్మ పుష్కరిణిలో అందంగా అలంకరించిన తెప్పపై విహరిస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు. అంతకుముందు ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్దనున్న నీరాడ మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన తెప్పోత్సవంలో అమ్మవారు పుష్కరిణిలో ఐదు చుట్లు తిరిగి భక్తులకు అభయప్రద దర్శనం ఇచ్చారు. అనంతరం గజవాహనంపై అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు ఆశీస్సులు అందించారు. సోమవారంతో అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ముగియనున్నాయి. ముగింపు వేడుకల సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారు పద్మ పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించనున్నారు. తెప్పోత్సవం అనంతరం అత్యంత విశేషమైన 'గరుడ వాహనం'పై అమ్మవారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు

- రేవంత్ గెలిచింది వాటితోనే!
- ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలి
- కర్ణాటక నుంచి 'నోటు'తో పాటు 'ఓటు' కూడా బదిలీ అయిందా?
- కల్వకుంట్ల కవిత ధ్వజం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిగినప్పటికీ, ఓట్ల అక్రమాలు ఆగడం లేదని టీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో తాము పరిశీలిస్తే ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కేవలం 32 వేల ఓట్ల మెజారిటీతోనే గెలిచారని గుర్తుచేసిన కవిత.. కొడంగల్‌లో ఉన్న ఈ 33 వేల డూప్లికేట్ ఓట్లతోనే ఆయన విజయం సాధించారనే బలమైన అనుమానం తమకు ఉందన్నారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నుంచి ఎన్నికల సమయంలో 'నోట్ల బదిలీ'తో పాటు 'ఓట్ల బదిలీ' కూడా జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్ల అక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే 7 వేల ఓట్లను తొలగించారని, అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో మాత్రం కేవలం 800 ఓట్లు మాత్రమే ఎందుకు తొలగించారో ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలన్నారు. ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని గుర్తించి తొలగించడానికి అధికారులకు ఏడేళ్ల సమయం పట్టిందని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం అంతర్రాష్ట్ర సరిహద్దుల డేటాను తక్షణమే పరిశీలించాలని కవిత సూచించారు. "హైదరాబాద్‌లో నివసిస్తున్న చాలా మంది ఓటర్లకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓటు హక్కు ఉంది. రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కడైనా ఒక చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలి. ఇలాంటి అంతర్రాష్ట్ర (ఇంటర్ స్టేట్) డూప్లికేట్ ఓట్లను వెంటనే గుర్తించి జాబితా నుండి తొలగించాలి." అని కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో మరియు సరిహద్దుల్లో ఉన్న ఈ బోగస్, డూప్లికేట్ ఓట్ల వ్యవహారంపై ఆధారాలతో సహా త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు కవిత స్పష్టం చేశారు.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్య్ర దినోత్సవం

- వేడుకల్లో పాల్గొన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ
- ఆకట్టుకున్న భారత ఆర్మీ, నౌకాదళాల కవాతు



**విక్టోరియా, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత్-సీషెల్స్ దేశాల మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్ చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన ఈ వేడుకల్లో సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు సంయుక్తంగా కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా మన సైనికులకు గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడి అభివాదం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గోల్డెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత



నౌకాదళ సిబ్బంది నిర్వహించిన కవాతు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ గంభీరంగా మార్చ్ చేయడం వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది. ఈ ఉత్సవాల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ 'ఐఎన్ఎస్ తార్కష్', స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన 'ఐఎన్ఎస్ ఇక్షాక్' సర్వే నౌకలు కూడా పాల్గొన్నాయి. ఈ నౌకల భాగస్వామ్యం ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ సహకారం మరింత బలపడుతుందనే సంకేతాలను స్పష్టం చేసింది. భారత్-సీషెల్స్ సముద్ర భద్రతా సహకారానికి ప్రతీకగా ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలతో పాటు భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ ఈ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్నాయని భారత నౌకాదళం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చారిత్రాత్మక వేడుకల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. తనకు లభించిన ఘన ఆతిథ్యానికి గానూ సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం" అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ఈ పర్యటనలో ప్రధాని మోదీకి సీషెల్స్ దేశపు అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరిజన్' లభించింది. ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి, సముద్ర తీర భద్రతకు మోదీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ఆ దేశ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ప్రధానికి అందజేసి గౌరవించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 29, 2026

# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- ఉప్పునుంతలలో 'సర్ ఓటర్ మ్యాపింగ్' అవగాహన సదస్సు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మన ప్రజాస్వామ్యంలో 'ఓటు' అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఆ ఓటు హక్కును మరింత పారదర్శకంగా, పటిష్టంగా మార్చేందుకే ప్రభుత్వం 'సర్ ఓటర్ మ్యాపింగ్' ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో నిర్వహించిన 'సర్ ఓటర్ మ్యాపింగ్' అవగాహన సదస్సు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, నిబంధనల ప్రకారం అర్హత లేని బోగస్ ఓట్లను తొలగించడం ద్వారా ఒక స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో, ముఖ్యంగా ఉప్పునుంతల మండలంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని అధికారులను ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ఉన్న బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా ప్రతి ఇంటిని సందర్శించి, మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు, డీసీసీ ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, నరసింహారెడ్డి, మల్‌రెడ్డి వెంకట్ రెడ్డి, కాశన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 'మర్యాద ఫౌండేషన్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం 'మర్యాద ఫౌండేషన్' ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 'మర్యాద ఫౌండేషన్' సౌజన్యంతో ఉప్పునుంతల గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం సమకూర్చిన 200 స్కూల్ బ్యాగులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పిల్లలకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ బట్టీ విధానానికి స్వస్తి చెప్పి, కృత్యాధార పద్ధతిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన అందిస్తున్నామని చెప్పారు. స్కూల్ బ్యాగులు అందించిన ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెండు అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, తాగునీటి వసతి కల్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. మర్యాద ఫౌండేషన్ కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఈ స్థాయికి ఎదిగామన్నారు. అమెరికాలో స్థిరపడిన తమ సోదరులు మర్యాద శ్రీనివాసరెడ్డి, మర్యాద కృష్ణారెడ్డిలు తాము సంపాదించిన దానిలో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలనే సత్సంకల్పంతో ఈ ఫౌండేషన్ స్థాపించారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. మూతపడే స్థితిలో ఉన్న స్కూల్‌ను సమిష్టి కృషితో 102 మంది విద్యార్థులతో కళకళలాడేలా చేసిన ఉపాధ్యాయుల అంకితభావాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలల్లోనే తన సొంత పిల్లలను చేర్పించి చదివిస్తున్న ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే డా.వంశీకృష్ణను, మర్యాద ఫౌండేషన్ ప్రతినిధులు మర్యాద కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డిలను, నూతన మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిలను పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఉప్పునుంతల సర్పంచ్ చింతగాల్ల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ శైలజ, డీసీసీ ఉపాధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, తహశీల్దార్ సుజాత, కాంగ్రెస్ నాయకులు తిప్పర్తి నరసింహారెడ్డి, మల్‌రెడ్డి వెంకట్ రెడ్డి, పాత్కుల రామచంద్రయ్య, ఆలూరి శ్రీనివాసులు, పాత్కుల నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ అంతయ్య ఆశయాలను కొనసాగిస్తాం

- సీపీఎం నేత దేశ్యా నాయక్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట మండలం సింగారం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు, అమరవీరుడు కామ్రేడ్ సాటు అంతయ్య 34వ వర్ధంతి సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన అంతయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేశ్యా నాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ్యా నాయక్ మాట్లాడుతూ.. నల్లమల ప్రాంతంలోని పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన అసాధారణ యోధుడు అంతయ్య అని కొనియాడారు. అచ్చంపేట ప్రాంతంలో ఎర్రజెండాను ఇంటింటికీ తీసుకెళ్లి, ప్రజా ఉద్యమాలకు వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అంతన్న అని గుర్తుచేశారు. నల్లమల అటవీ ప్రాంత ప్రజల సమస్యలపై, స్థానిక భూస్వామ్య శక్తులపై, ప్రజా వ్యతిరేక విధానాలపై అధికారులను నిలదీసిన ధీశాలి అని శ్లాఘించారు. అచ్చంపేట మండలంలో ఎర్రజెండా నీడన అంచలంచెలుగా ఎదుగుతూ ప్రజాదరణ పొందుతున్న అంతయ్యను చూసి ఓర్వలేక నాటి నక్సలైట్లు ఆయన్ను పిరికిపందల్లా హత్య చేశారని దేశ్యా నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. భౌతికంగా అంతన్నను చంపినా.. ఆయన నిలిపిన ఆశయాలను, ఎర్రజెండా సిద్ధాంతాన్ని ఎవరూ చంపలేరని స్పష్టం చేశారు. నేడు ఆయన ఆశయ సాధన కోసం ఎంతోమంది యువకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని ప్రజా ఉద్యమాల్లో ముందుకు వస్తున్నారన్నారు. అంతయ్య ఆశయాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని, అందుకు మనమందరం ప్రజా పోరాటాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సైదులు, గ్రామ కార్యదర్శి బక్కయ్య, సీనియర్ కామ్రేడ్లు ఎస్. వెంకటయ్య, పర్వతాలు, బుచ్చయ్య, నరేష్, నారాయణ, రవి, శ్రీను, రైతు సంఘం నాయకులు పర్వతాలు, సుందరయ్య, రమేష్, గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలోని మధుర నగర్ కాలనీ సమస్యలపై అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తక్షణమే స్పందించారు. కాలనీ వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించిన ఆయన, దాదాపు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు సోమవారం అధికారికంగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ మాట్లాడుతూ.. మధుర నగర్ కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి, ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడానికి కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. తమ కాలనీ సమస్యలను విన్నవించిన వెంటనే స్పందించి, రూ. 80 లక్షల భారీ నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులను మంజూరు చేయించి, స్వయంగా వచ్చి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణకు మధుర నగర్ కాలనీ ప్రజలు, మహిళలు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు చింతల రాజ్ గోపాల్, టౌన్ ప్రెసిడెంట్ ఖాదర్, సీఈఓ రాములు, భరత్, అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ మురళి, సంబంధిత విభాగాధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ



**చందుర్తి, వాయిస్ ఆఫ్ వందే భారత్:** చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు మెరుపుల రవి ఇటీవల అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం ఎన్గల్ గ్రామానికి చేరుకుని, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు చల్మెడ లక్ష్మీనరసింహారావు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ పరామర్శలో స్థానిక సర్పంచ్ శోభారాణి సుధాకర్, సింగిల్ విండో చైర్మన్లు తిప్పని శ్రీనివాస్, కిషన్ రావు, పార్టీ సీనియర్ నాయకులు డప్పుల అశోక్, ఈర్లపల్లి రాజు, జనార్ధన్, మాదాసు ప్రసాద్, కొండ లక్ష్మణ్, ఎండీ సమీర్, ముద్రకోల వెంకటేశం, బత్తుల కమలాకర్, గసికంటి కిషన్, గొల్లెం రాజు, మాదాసు స్వామి, కుసుంబ ప్రసాద్, దుమ్మ ఆనంద్, నగేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇల్లంతకుంటలో డ్రైనేజీ పనుల ప్రారంభం



**ఇల్లంతకుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని 5వ వార్డు ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎన్నో రోజులుగా వార్డులో నెలకొన్న మోరి సమస్య పరిష్కారానికి స్థానిక వార్డు సభ్యురాలు దయ్యాల లక్ష్మి ప్రత్యేక చొరవ చూపారు. ఆమె ఆధ్వర్యంలో వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం అధికారికంగా ప్రారంభించారు. తమ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను గుర్తించి, తక్షణమే నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ దార సురేష్ కి, వార్డు సభ్యురాలు దయ్యాల లక్ష్మికి, అలాగే గ్రామ పాలకవర్గ సభ్యులందరికీ 5వ వార్డు కాలనీ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న సర్పంచ్ దార సురేష్, వార్డు సభ్యురాలు లక్ష్మిల సమన్వయ నాయకత్వాన్ని ఈ సందర్భంగా వార్డు ప్రజలు ప్రత్యేకంగా కొనియాడారు.

## బస్సు వేళలు మార్చాలని ఎమ్మెల్యేకు వినతి




**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ఉప్పునుంతల మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం బస్సు వేళల్లో మార్పులు చేయాలని కోరుతూ విద్యార్థులు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఉప్పునుంతల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థులు స్వయంగా కలుసుకున్నారు. తాము ఉదయాన్నే పాఠశాలలకు రావడానికి, సాయంత్రం బడులు ముగిసిన తర్వాత సొంత గ్రామాలకు చేరుకోవడానికి ప్రస్తుతం ఉన్న బస్సు టైమింగ్స్ ఇబ్బందికరంగా మారాయని, దీనివల్ల విద్యాసంవత్సరం నష్టపోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యలపై ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ తక్షణమే సానుకూలంగా స్పందించారు. అక్కడికక్కడే అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ తో ఫోన్ ద్వారా మాట్లాడారు. గ్రామీణ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, పాఠశాలల వేళలకు అనుగుణంగా బస్సు సర్వీసుల సమయాలను మార్చాలని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డా.వంశీకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి అధునాతన రెస్క్యూ పరికరాలు

- అందజేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టాలి
- డిస్ట్రిక్ట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులతో రెస్క్యూ సామగ్రి కొనుగోలు
- 'ముంతా' తుఫాన్ సమయంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సేవలు అమోఘం



**మామునూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కమాండ్ కంట్రోల్ విభాగం అలర్ట్‌గా ఉంటూ, త్వరితగతిన ప్రమాద స్థలాలకు చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మామిడిపల్లిలోని 4వ బెటాలియన్ పరిధిలో గల స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా.. జిల్లా విపత్తు నిర్వహణ సంస్థ నిధులతో కొనుగోలు చేసిన అధునాతన రెస్క్యూ పరికరాలను సోమవారం కలెక్టర్ అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా బెటాలియన్‌కు విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి



ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా కలెక్టర్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది విపత్తుల వేళల్లో ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగించే వివిధ రకాల అధునాతన రెస్క్యూ పరికరాలను, సాంకేతిక సామగ్రిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరదలు, భూకంపాలు, భారీ వృక్షాలు కూలిపోవడం వంటి అత్యవసర సమయాల్లో ఈ సరికొత్త పరికరాలు ఎలా పనిచేస్తాయనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. గతేడాది (2025) సంభవించిన 'ముంతా' తుఫాన్ విపత్తు సమయంలో హన్మకొండ జిల్లా వ్యాప్తంగా 4వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి చేసిన సేవలపై హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు, వరదల్లో చిక్కుకున్న వందలాది మంది బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడంలో వారు చూపిన సమయస్ఫూర్తి, సాహసోపేతమైన అంకితభావం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజా రక్షణే ధ్యేయంగా అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు ఈ. వీరన్న, జె. రాజేందర్, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఆర్ఐ రవి, ఆర్ఐలు కార్తీక్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఉన్నతాధికారులు, రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్ పోలీసులకు విపత్తు నిర్వహణపై శిక్షణ

- నాలుగు కీలక విభాగాల్లో నిష్ణాతులతో శిక్షణ
- 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి

**మామునూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రకృతి విపత్తులు, అత్యవసర ప్రమాదాలు సంభవించినప్పుడు క్షేత్రస్థాయిలో తక్షణమే స్పందించి ప్రాణనష్టాన్ని నివారించేందుకు వీలుగా మహబూబాబాద్ జిల్లా పోలీసులకు ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. మామునూర్‌లోని 4వ బెటాలియన్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "బేసిక్ ఫస్ట్ రెస్పాన్స్ " కోర్సు కోసం మహబూబాబాద్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, సివిల్ విభాగాల నుండి 30 మంది పోలీసు సిబ్బంది సోమవారం ఇక్కడికి చేరుకున్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రమాదాల వేళల్లో మొదటి రక్షకులుగా పోలీసులు వ్యవహరించాల్సి ఉంటుందని, అందుకే ఈ అత్యాధునిక శిక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కోర్సులో భాగంగా పోలీసు సిబ్బందికి ముఖ్యంగా నాలుగు ప్రధాన విభాగాలపై నిష్ణాతులైన మాస్టర్ ట్రైనర్లచే క్షేత్రస్థాయి శిక్షణ ఇస్తామని ఆయన వివరించారు. శిక్షణ ఇచ్చే నాలుగు ముఖ్య విభాగాలు ఎమ్ఎఫ్ఆర్: ప్రమాద స్థలంలో బాధితులకు ఆసుపత్రికి తరలించే ముందే అందించాల్సిన అత్యవసర ప్రాథమిక వైద్య



చికిత్సలపై అవగాహన. సీఎస్ఎస్ఆర్: భూకంపాలు, ప్రమాదాల వల్ల భవనాలు, నిర్మాణాలు కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్న వారిని సురక్షితంగా వెలికితీసే పద్ధతులు. రోప్ రెస్క్యూ : లోయలు, కొండలు, ఎత్తైన భవనాల పైనుండి తాడు సహాయంతో బాధితులను రక్షించే సాంకేతిక నైపుణ్యాలు. ఏ.డీ.ఆర్.సీ : వరదలు, జలాశయాల్లో మునిగిపోతున్న వారిని కాపాడేందుకు అవసరమైన ఈత, జల విపత్తు రెస్క్యూ నైపుణ్యాలు. ఈ అధునాతన శిక్షణను మహబూబాబాద్ జిల్లా పోలీసులు సద్వినియోగం చేసుకుని, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడేలా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కమాండెంట్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా డీఎస్పీ శ్రీనివాస్, 13వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు ఈ.వీరన్న, జె.రాజేందర్, ఆర్ఐలు రవి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, బెటాలియన్ ఉన్నతాధికారులు, శిక్షణార్థులైన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అపర చాణక్యుడు పీవీ..



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన అపర చాణక్యుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పీవీ నరసింహారావు 105వ జయంతి వేడుకలను వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. దేశ ప్రధాని పదవిని అధిష్టించిన మొదటి దాక్షిణాత్యుడు, ఒకే ఒక్క తెలుగువాడు పీవీ నరసింహారావు మాత్రమేనని కొనియాడారు. 1991 నుండి 1996 వరకు భారతదేశానికి 9వ ప్రధానమంత్రిగా పనిచేసిన ఆయన.. గొప్ప బహుభాషావేత్త, ప్రఖ్యాతి గాంచిన రచయిత అని గుర్తుచేశారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన క్లిష్ట సమయంలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, తన దూరదృష్టితో విప్లవాత్మకమైన ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి, కుంటుపడుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో తగిన సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తి కాలం పాటు చాణక్య నీతితో నడిపించడం ఆయన రాజకీయ చతురతకు నిదర్శనమన్నారు. 1957లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన పీవీ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా సంస్కరణలు తెచ్చారని, ఆ తర్వాత కేంద్ర రాజకీయాల్లో రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిగా, ప్రధానిగా దేశ కీర్తిని పెంచారని వివరించారు. అదే సమయంలో దేశ లౌకిక విధానానికి పరీక్షగా నిలిచిన బాబ్రీ మసీదు కూల్చివేత ఉదంతం కూడా ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే జరిగిందని పేర్కొన్నారు. పీవీ దార్శనిక నాయకత్వం, దేశాభివృద్ధికి వారు చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని లక్ష్మీనారాయణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం తక్షణమే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు ఎండీ సయ్యద్ డిమాండ్ చేశారు. అచ్చంపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను యూఎస్ఎఫ్ఐ బృందం సోమవారం సందర్శించి, క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో ఎండీ సయ్యద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధికంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే చేరి చదువుకుంటారని గుర్తుచేశారు. గ్రామీణ, దూర ప్రాంతాల నుండి కళాశాలలకు వచ్చే విద్యార్థులు ఉదయాన్నే బయలుదేరడం వల్ల మధ్యాహ్నానికి టిఫిన్ బాక్సులు తెచ్చుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలితో అలమటించే పేద విద్యార్థులకు న్యాయం జరగాలంటే పాఠశాలల మాదిరిగానే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో కేవలం భోజన వసతే కాకుండా, విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను తనిఖీ చేయాలని, పేద విద్యార్థుల ఇబ్బందులను గమనించి మధ్యాహ్న భోజన పథకం అమలుకు నివేదికలు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ అచ్చంపేట నియోజకవర్గ నాయకులు లడ్డు, వాసుదేవ్, విజయలక్ష్మి, అశ్విని, నిఖిత, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.